# ముమ్మూర్తి

**నా** దగ్గిర ఈ స్కెచ్ పుస్తకం తప్ప మరేమీ లేదు. నాకేమయినా జరిగితే దీన్ని దయచేసి ఏ పోలీసుస్టేషనులోనో లేకపోతే మీకు తెలిసిన ఏ న్యాయవాదికో ఇవ్వగలిగితే నా ఆత్మ ఎంతో సంతోషిస్తుంది. రాయవలసింది క్లుప్తంగా రాస్తున్నాను. నేను విచిత్రమయిన పరిస్థితుల్లో బందీగా ఉన్నట్టు అనిపిస్తోంది. బయటపడే మార్గం కనిపిస్తుందనే ఆశ ఉంది. లేకపోతే? వీలుకాకపోతే?

నేనొక చిత్రకారుడిని. నా వయసు ముప్ఫయి ఎనిమిది సంవత్సరాలు. నా చిన్నప్పుడే మా అమ్మ చనిపోయింది. నాన్న మళ్లీ పెళ్ళి చేసుకోలేదు. నన్ను చాలా ప్రేమగా పెంచాడు. ఏ విషయంలోనూ కొదవ చేయలేదు. మంచి స్కూల్లో వేసి చదువు చెప్పించాడు. నేను కాలేజీలో చేరిన రెండో సంవత్సరంలో కారు ప్రమాదంలో ఆయన చనిపోయేసరికి నా జీవితం తెగిన గాలిపటంలా అయిపోయింది. మాకుదగ్గిర బంధువులు ఉన్నారు కాని అందులో ఆత్మీయులంటూ ఎవరూ లేరు. బతికి ఉండగా నాన్న ఎక్కువేమీ సంపాయించలేదు. నాకు తెలియని వ్యసనాలు ఏమయినా ఉండేవేమో నాకు తెలియదు. నాకు తెలిసిందల్లా వారానికో పదిరోజులకో ఒకసారి మందుసీసా తెచ్చుకుని పుచ్చుకునేవాడు. సిగరెట్లు మటుకు కాల్చేవాడు. ఆయన స్వవిషయాల్లో నేనెప్పుడూ జోక్యం చేసుకునేవాడిని కాదు. వ్యక్తి మంచివాడు. నాకు మల్లె ఆయనకూ ఎక్కువమంది స్నేహితులు లేరు.

ఆయన చనిపోయాక నా చదువు ఆగిపోయింది. నాకూ చదువుకోవాలనిపించ లేదు. మా నాన్న ద్వారా నేను చిత్రాలు గీయటం నేర్చుకున్నాను. ఎప్పటికప్పుడు సూచనలిస్తూ నా భుజం తట్టి నన్నెంతో ప్రోత్సహించాడు. ఈ రోజు చిత్రకారుడిగా నిలబడగలిగానంటే కారణం మా నాన్న. నన్ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది వాసుదేవరావు. నా కేన్వాసులన్నీ పూర్తి అయిన వెంటనే ఆయన తీసుకు వెళ్ళి పోయేవాడు. ఎవరికి అమ్మేవాడో, ఎంతకమ్మేవాడో నేనెప్పుడూ అడగలేదు. ఠంచనుగా డబ్బులు పంపిస్తుంటాడు. చిన్నా చితకా పత్రికల్లోని కథలకు, కవితలకు బొమ్మలు వేస్తుండేవాడిని,

కాని పారితోషికం గొప్పగా ఉండేదికాదు. పదిరూపాయల పారితోషికానికి పదిసార్లు తిరగాల్సి వస్తుండేది. విసుగేసి పత్రికల జోలికి వెళ్లటం మానేశాను.

అసలు విషయానికి వస్తాను. ఇవేళ మధ్యాహ్నం భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని బయల్దేరి గ్రంథాలయానికి వచ్చి కూర్చుని దినపత్రికలు ముందు వేసుకున్నాను. ఆ సమయంలో గ్రంథాలయంలో ఎక్కువమంది ఉండరు. ఉన్నవాళ్ళలో సగంమంది నిద్రపోతుంటారు. దినపత్రికలలో నన్ను ఎక్కువగా ఆకర్షించేది క్రయిం కాలం. వాటిని ఆధారంగా తీసుకుని నా స్కెచ్‌లు మొదలవుతాయి. కొండలూ, గుట్టలూ నదులూ సముద్రాలు, పూలూ చేసి చేసి విసుగుపుట్టింది. వాటి గురించి ఆలోచించటం మానేశాను. ఈ పూట నాలుగయిదు దినపత్రికలు తిరగవేశాను కాని ఏకాగ్రతతో కాదు. మనసు ఎక్కడికో జరుగుతోంది. చివరకు ఒక పత్రికలోని క్రయిం కాలం దగ్గిర నా చూపులు మనసు ఏకమయి నిలబడి పోయాయి. ఆ వార్తను ఒకటికి నాలుగుసార్లు చదివాక నా భావానికి రూపం దొరికింది.

గ్రంథాలయం నుండి బయటకు వచ్చి మూలగా ఉన్న చెట్టు కింద కూర్చున్నాను. ఉదయం నుండి సూర్యుడు చెరుగుతున్న నిప్పుల్లో గాలి ఉక్కిరి బిక్కిరి అవుతోంది. స్కెచ్‌బుక్ తీసి నేనూహించుకున్న రూపాన్ని చిత్రీకరించటానికి చాలాసేపు పట్టింది. పూర్తి చేశాక నాకు చాలా సంతోషం కలిగింది. ఈ మధ్యకాలంలో నా మట్టుకునాకు అంత చక్కటి చిత్రం వేయలేదనిపించింది. అందమయిన ఊహలు ఎప్పుడూ రావు.

ఈ చిత్రంలో ఒక హంతకుడు న్యాయస్థానంలో న్యాయమూర్తి ముందు చేతులు కట్టుకుని బోనులో నిలబడి ఉంటాడు. అతను లావుగా, పొట్టిగా ఉంటాడు. బట్టతల. కనుబొమ్మలు దట్టంగా ఉంటాయి. లావుపాటి పెదాలు. తనకు న్యాయమూర్తి వేసిన శిక్షకు అతని కోలకళ్లు కుంచించుకు పోతున్నట్లు వేశాను. అతనికి ఉరిశిక్ష అంటే ఎంత భయమో చక్కగా చూపగలిగినందుకు నాకు తృప్తి కలిగింది. ఇటువంటి ప్రయోగం చేయటం నాకిదే మొదటిసారి. వాసుదేవరావుకు నచ్చుతుందో, లేదో? కేన్వాస్ మీద తెస్తే చాలా బావుంటుంది అనుకున్నాను.

లేచి నిలబడి స్కెచ్‌బుక్ పట్టుకుని సిగరెట్ వెలిగించి గ్రంథాలయం ఆవరణ దాటి బయటకు వచ్చాను. వేడిగాలి విసురుగా వీస్తోంది. మెయిన్‌రోడ్ బాగు చేస్తున్నారు. కంకర రాళ్లమీద నడవటం నాకు ఇష్టంలేదు. అప్పుడే ఇంటికి వెళ్దామనిపించటం లేదు. కొండవైపు నడవటం మొదలెట్టాను. కేన్వాస్‌లో ఏఏకలర్లు వాడాలో కుంచించుకు పోయే కళ్లను ఎలా చూపించాలో ఆలోచించుకుంటూ అయిదారు మైళ్లు నడిచి ఉంటాను.

ఇంకా ఎక్కువదూరం నడిచి ఉండేవాడినేమో, ఎదురుగా వచ్చిన ఎవరో కుర్రాడు టైం ఎంతయిందని నన్ను అడిగేసరికి ఆగి చేతిగడియారం చూసి, "ఆరూ ఇరవయి" అన్నాను.

కుర్రాడు రైలు కట్ట మీదకు గొడ్లు తోలుకుంటూ వెళ్లిపోయాడు. దూరంగా ఎక్కడో రైలు కూత వినిపిస్తుంటే చుట్టూ చూశాను. సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆకాశం ఎర్రగా ఉంది. నేను ఊరి చివరికంటా వచ్చాను. కొండ దాటితే సమాధుల తోట వస్తుంది. చీకటి పడితే ఆ పక్కకు ఎవరూ రారు. వెనక్కి తిరిగి పదిగజాలు నడిచాక నాకు ఈ ఇల్లు కనిపించింది. నోరు పిడచకట్టుకుపోయేంత దాహం వేసి ఉండకపోతే నేను ఈ ఇంటికి వచ్చి ఉండేవాడిని కాను. చెక్కగేటు నెట్టి లోపలికి నడిచాను. చుట్టు పక్కల మరో ఇల్లులేదు. కొండమీంచి వీచేగాలి కూడా వేడిగా ఉంది. పాతబడుతున్న పెంకుటింటి పక్క నుండి సుత్తితో రాయి కొడుతున్న చప్పుడు వినిపిస్తున్న వైపుకు నడిచాను.

ముందు అతని వీపు కనిపించింది. స్టూలుమీద కూర్చుని ముందుకు వంగి తన ఎదురుగా ఉన్న నల్లరాతి మీద చెక్కిన అక్షరాలకు మెరుగుపెడుతున్న వాడల్లా నా అడుగుల చప్పుడుకు చేస్తున్న పని ఆపి వెనక్కి తిరిగి నా వంక చూశాడు. అతని మెడ లావుగా, పొట్టిగా ఉంది. ఆగాను. నా కాళ్లు భూమికి అతుక్కుపోయినట్లు అడుగు ముందుకు పడలేదు. నా కళ్లను నేను నమ్మలేకపోయాను. భావం మినహాయిస్తే అతను ముమ్మూర్తులా నేను వేసిన చిత్రంలో హంతకుడిలా పొల్లుపోకుండా ఉన్నాడు. నా ఆశ్చర్యానికి అంతులేదు. ఊపిరి తీసుకోవటం కూడా మర్చిపోయాను.

చేతుల్లోని ఉలిని, సుత్తిని కింద పెట్టి భుజం మీదున్న ఎర్రటి తువ్వాలుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుని నన్ను ఎరిగిన మనిషిలా పలకరింపుగా నవ్వి తనకు దగ్గరగా ఉన్న మరో స్టూలు చూపించి నన్ను కూర్చోమన్నట్లుగా సైగ చేశాడు. మంత్ర ముగ్ధుడిలా కూర్చున్నాను.

"అయిదు నిమిషాల కిందట మీరటు వెళ్తుంటే చూశాను. మీరిక్కడకు తప్పకుండా వస్తారని నాకు తెలుసు. మీరిక్కడికి ఎందుకు వచ్చారో కూడా నేనూహించగలను. మీకు దాహంవేసి ఇక్కడకు వచ్చారు. అవునా?" అడిగాడు.

నేను ఆశ్చర్యంలోంచి కోలుకోలేదు. తలూపాను.

తన పక్కనే ఉన్న కూజాలోంచి ప్లాస్టిక్ గ్లాసులోకి నీళ్లు వొంపి నాకందించాడు. రెండుగ్లాసులు తాగాక కాని నా దాహం తగ్గలేదు.

"ఇంకో గ్లాసిచ్చేదా?"

"వద్దు."

"నాపేరు కేశవులు. సమాధి పెట్టెలు తయారు చేస్తుంటాను. సమాధి రాళ్ళ మీద చనిపోయిన వాళ్ల పేర్లు వివరాలు చెక్కుతుంటాను."

అతని కంఠస్వరం బొంగురుగా ఉంది. అతనికి యాభయి సంవత్సరాలుండొచ్చు. నా దృష్టి అతని మీంచి గోడకు ఆనించి ఉన్న నల్లరాయి మీదకు జరిపాను. నల్లరాయి పాలిష్ చేయబడి నిగనిగలాడుతోంది. నాకు పాలరాళ్ల కంటే నలుపు రాళ్లంటేనే ఇష్టం.

"అదెవరిది?" అడిగాను.

"ఎవరిదని చెప్పాలో నాకే తెలియటం లేదు. గత పదిరోజులుగా నాకు పనేమీలేదు. ఎవరయినా చనిపోతేనే నాకు పని. చనిపోవటం మానేశారు. ఊరికనే కూర్చోటం ఇష్టంలేక నా ఊహకు తట్టిన పేరును ఈ రాయి మీద చెక్కాను." అని రాయి వంక గర్వంగా చూసి, "డిజయిన్ చాలా చక్కగా వచ్చింది కదూ?" అంటూ సమాధి రాయిని నా వైపుకు తిప్పాడు. దానిమీద ఇలా ఉంది.

బి.కె.ప్రసాద్

జననం : 17.4.1940 మరణం : 23.5.1978

చుట్టూ లతలు అల్లిన డిజయిన్ ఉంది. దానికి బంగారపు రంగు వేశాడు.

కేశవులు ముఖంలోకి చూస్తుంటే అతనా రాయిని గోడ కానించి కట్టలోంచి బీడీ తీసి వెలిగించి దమ్ములాగి "చిన్న పని మిగిలిపోయింది. అక్షరాలకు తెల్లటి పెయింటు వేస్తే ఎంతో బావుంటుంది" అన్నాడు.

నా వెన్నులోంచి చలి మొదలయి వళ్లంతా పాకటం మొదలెట్టింది. నా గొంతులో తడి ఆరిపోయింది. గుండె వేగంగా కొట్టుకోవటం మొదలెట్టింది.

"ఈపేరు ఎవరిచ్చారు?" అడిగాను.

"ఎవరూ ఇవ్వలేదు. ఊహించాను. నా మనసుకు తట్టిన పేరు చెక్కాను. అంతే,. ఏం, పేరు బాగాలేదా?"

"బాగానే ఉంది. నాకు మటుకు ఆశ్చర్యంగా ఉంది."

"ఎందుకు?"

"ఆ పేరు నాది కాబట్టి" నెమ్మదిగా అన్నాను.

ఆశ్చర్యపోతూ నా ముఖంలోకి చూసి ఆరిపోయిన బీడీని మళ్లీ వెలిగించుకుని తల అడ్డంగా ఆడించాడు. తువ్వాలుతో జిడ్డు వారుతున్న ముఖాన్ని మరోసారి తుడుచుకుని రెండు చేతులు తల వెనక పెట్టుకుని గోడకు చేరగిలబడి, "మరి... మరి, ఆ తేదీలో?" అడిగాడు.

"17.4.1940న నేను పుట్టాను."

అతను ఆశ్చర్యం నుండి తేరుకోక ముందే నా స్కెచ్ బుక్ తెరిచి అతని చిత్రం ఉన్న పేజీ తీసి అతని ముందుంచి నా భావం విడమర్చి చెప్పినప్పుడు అతని ముఖం బిగుసుకుపోయింది. స్కెచ్‌బుక్ తన చేతుల్లోకి తీసుకుని కొద్దిసేపటివరకు తదేకంగా తన బొమ్మ వంక చూసుకుని చివరకు తల పైకెత్తి ఏదో అనబోయాడుకాని, అనలేదు.

"నా పేరు, నాగురించి నువ్వు ఎక్కడో విని ఉంటావు. అవి మనసులో కదులుతుంటే రాతిమీద చెక్కాలనిపించిందేమో." అంటుంటే అతను నా మాటలకు అడ్డువచ్చి, "మరి మీ పుట్టినతేదీ మాటేమిటి? మీరు కూడా నన్ను లోగడ ఎక్కడో చూసి ఉండొచ్చు కదా?" అడిగాడు.

"లోగడ నేను నిన్ను ఎక్కడా చూడలేదు. ఇవేళే మొదటిసారిగా చూస్తున్నాను." అని సిగరెట్ వెలిగించాను. ఆరిపోయిన అగ్గిపుల్లను దూరంగా విసిరి "నువ్వేమీ అనుకోనంటే ఒక ప్రశ్న అడుగుతాను" అన్నాను.

"అడగండి."

"నీకు ఉరిశిక్ష పడేంత తప్పు ఏదయినా చేశావా?"

తల అడ్డంగా ఆడించి, "లేదు. చేయలేదు" అన్నాడు.

"ఇదంతా విచిత్రంగా ఉంది" లేచి స్కెచ్‌బుక్ చేతిలోకి తీసుకున్నాను. ఎంత మామూలుగా ఉందామని అనుకుంటున్నా ఆందోళన అడ్డం వేస్తోంది. ఇంటికి వెళ్లి చన్నీళ్ల స్నానం చేస్తేగాని మనసు మామూలుగా అయ్యేట్టు లేదు. "వెళ్లొస్తాను" అన్నాను.

"మీరెక్కడ ఉంటున్నారు?"

చెప్పాను.

"అబ్బో, చాలా దూరం నుండే వచ్చారు" అని లేచి నిలబడ్డాడు. నాకూడా గేటు వరకు వచ్చి, "ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోకూడదూ?" అడిగాడు.

"ఎంతలోకి ఇంటికి వెళ్లిపోతాను? వద్దు."

"మీరు మొహమాటపడొద్దు. నామాట వినండి. కీడెంచి మేలంచమన్నారు కాబట్టి చెబుతున్నాను. ఈ పూట మా ఇంట్లోనే భోజనం చేసి ఈ రాత్రికి ఇక్కడే పడుకుని రేపు

ఉదయాన్నే వెళ్లండి. ఇవేళ మీకేదయినా ప్రమాదం కలగవచ్చని అనిపిస్తోంది. ఈ రాత్రి గడిస్తే మీకు ఏ ఆపదా కలగదని నాకు నమ్మకంగా ఉంది. ఎందుకలా అనిపిస్తుందో నాకే తెలియదు."

నా మంచి కోరి చెబుతున్నప్పుడు కాదనటం ఇష్టం లేక "సరే" అన్నాను. ఇదే నా జీవితంలో చేసిన ఆఖరి పొరపాటని అనుకుంటాను.

భోజనాలు ముగించేసరికి తొమ్మిది దాటింది. కేశవులు నాకు ఆరుబయట పడక ఏర్పాటు చేశాడు. తనూ నా మంచానికి కొద్దిదూరంలో మరో మంచం వేసుకుని అలా మేను వాల్చాడో లేదో ఇంట్లోంచి అతని భార్య పిలిచేసరికి లోపలికి వెళ్లిపోయాడు. అతని వెనకనే తలుపు మూసుకుపోయింది.

పడుకుని కళ్లు మూసుకున్నాను. ఆకు కదలటం లేదు. వేడికి గాలి పగిలి పోతోంది. నిద్ర రావటం లేదు. లేచి కూర్చుని దీపం వత్తి పెద్దది చేసి ఆ వెలుగులో ఇది రాస్తున్నాను. నాకు భయంగా ఉంది. నా మనసు కీడు శంకిస్తోంది.

కీచుమని చప్పుడు వేస్తూ తలుపు తెరుచుకుంది. గుండె ఝల్లు మంటుంటే గుమ్మం వైపు చూశాను. ముందు హరికన్ లాంతరు పట్టుకుని కేశవులు భార్య బయటకు వచ్చింది. ఆమె వంటిమీద రుద్రాక్ష మాల తప్ప మరేమీ లేదు. జుట్టు విరబూసుకుని ఉంది. నుదిటి మీద రూపాయి కాసంత బొట్టు మూడోకన్నులా మెరుస్తోంది. ఆమె వెనకాల కేశవులు దిశగా నిలబడి ఉన్నాడు. ఇద్దరూ ఏదో పూజ చేసి బయటకు వచ్చినట్లుగా ఉంది. అతని చేతిలో గొడ్డలి ఉంది. మనుషులను ఉన్మాదంతో ఊపిరాడనీయకుండా చేయటానికి గడ్డ కడుతున్న ఈ వేడి చాలు.

*(డబ్ల్యూ. హెచ్. హార్వే రచన ఆగస్ట్ హీట్ చదివాక)*

◆ విజయ, మాసపత్రిక – ఏప్రిల్ 1985